
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం। 24। జూన్। 2025



సోమశిలలో 32.860 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారానికి 34.860 టీఎంసీలు ఉన్నాయి. 486 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, డెల్టాకు 3,330, ఉత్తర, దక్షిణ కాలువలకు 1,425 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,02,000
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,230
3 శాతం జీఎస్టీతో	రూ.9,507
నవర (8 గ్రా)	రూ.76,056

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.1 /27.5

జిల్లాలో మంగళవారం అక్కడక్కడ ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉండి వాతావరణం పొడిగా ఉంటుంది. సోమవారం గాలిలో తేమ 53 శాతంగా నమోదైంది.

కూటమి మోసాలపై యువత గర్జన

➡ ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి ఇవ్వాలంటూ కదంతొక్కిన యువత

ఫీజు రీయింబర్స్‌మెంట్, ఏడాదికి 5 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ తదితర హామీలపై కూటమి ప్రభుత్వం చేసిన మోసాన్ని ఎండగడుతూ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో యువత గర్జించింది. హామీలను తుంగలో తొక్కిందంటూ యువతీ, యువకులు, విద్యార్థులు, నిరుద్యోగులు కదం తొక్కారు. గత ప్రభుత్వం కల్పించిన ఉద్యోగాలను ఊడగొట్టిందంటూ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు.

- ఏడాదికి 5 లక్షల ఉద్యోగాలెక్కడ అంటూ ప్రభుత్వాన్ని నిలదీత
- గత ప్రభుత్వం కల్పించిన ఉద్యోగాలు ఊడగొడుతోందని మండిపాటు
- పాత జెడ్పీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ, ధర్నా
- డీఆర్వో ఉదయభాస్కర్‌కు వినతి పత్రం అందజేత



కలెక్టరేట్‌కు భారీ ర్యాలీగా వస్తున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నేతలు

నెల్లూరు (అర్బన్)/ నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నిరుద్యోగ యువతను మోసం చేసిన కూటమి ప్రభుత్వం తీరును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం పిలుపు మేరకు సోమవారం యువత కలెక్టరేట్ వద్దకు కదలి వచ్చింది. విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు ప్రభుత్వ చేస్తున్న అన్యాయాన్ని నిరసిస్తూ ప్లకార్డులు చేతబట్టి ప్రభుత్వ వ్యతిరేక నినాదాల హోరుతో కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. పాత జెడ్పీ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. తొలుత బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున వినూత్నంగా రిక్షా తొక్కుతూ యువత పడుతున్న కష్టాలపై ప్రభుత్వ తీరును ఎత్తి చూపారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం కూటమి హామీలు అమలు చేయాలంటూ డీఆర్వో ఉదయభాస్కర్‌రావుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఊటుకూరు నాగార్జున మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల ముందు అలవిగాని హామీలిచ్చారని, అధికారం చేపట్టాక వాటిని తుంగలో తొక్కారని దుయ్యబట్టారు. ఏడాదికి 5 లక్షల ఉద్యోగాలు కలిస్తానని చెప్పి అధికారం చేపట్టి ఏడాదైనా ఒక్క ఉద్యోగం కల్పించలేదన్నారు. తనకు ఓటేస్తే వలంటీర్లకు ఇస్తున్న జీతాన్ని రూ.10 వేలకు పెంచుతానని నమ్మబలికి అధికారం రాగానే రాష్ట్రంలోని 2.50 లక్షల మంది వలంటీర్లను వీధుల పాల్జేశారన్నారు. గతంలో తమ పార్టీ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో వివిధ రంగాల్లో వేలాది ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. ఇంటింటికీ రేషన్ పంపిణీ పేరుతో వందలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. మద్యం షాపులను ప్రభుత్వ పరం చేసి నిరుద్యోగ యువతకు అక్కడ అవుట్ సోర్సింగ్ ద్వారా ఉద్యోగాలు కల్పించారన్నారు. దేశమే గర్వించే రీతిలో సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసి ఇంటి వద్దకే పౌర సేవలు అందించేందుకు వలంటీర్ల వ్యవస్థకు రూపకల్పన చేశారన్నారు. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేయడంతో రాష్ట్రం పురోగమన దిశ నుంచి తిరోగమనం వైపు పరుగులు తీస్తుందన్నారు. కూటమి దాష్టీకాలు చూసి పారిశ్రామిక వేత్తలు పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం లేదన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ప్రారంభించిన పరిశ్రమల నిర్మాణాలు ఆగిపోయాయన్నారు. ఏడాది కాలంలో చదువుకున్న ఒక్క విద్యార్థికి ఉద్యోగం రాలేదన్నారు. పారిశ్రామిక రంగం కుప్పకూలిపోతే, ప్రధానమైన వ్యవసాయం రంగం కూడా నష్టాల్లో కూరుకుపోయిందన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు లేదన్నారు. మద్యాన్ని ఏరులై పారించడంతో శాంతిభద్రతలు పాతాళానికి దిగజారిపోయాయన్నారు. జిల్లాలోనే 100 మందికి పైగా అభాగ్య మహిళలు, చిన్నారులు అత్యాచారాలకు గురయ్యారన్నారు. అంగన్‌వాడీలకు, ఆశ కార్యకర్తలకు రేషన్‌కార్డులు రద్దు చేసే కుట్ర జరుగుతోందన్నారు. ఈ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. ఇలాంటి ప్రభుత్వానికి ఏడాది కాలంలోనే ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబును నమ్మి నిలువునా మోసపోయామని ప్రజలు గ్రహించారన్నారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు కసితో ఉన్నారన్నారు.

➡ యువజన విభాగం నాయకుడు, కార్పొరేటర్ వేలూరు మహేష్ మాట్లాడుతూ అలవి గాని హామీలివ్వడం వాటిని నీరుగార్చడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఆయన సీఎంగా కేవలం రూ.1000 మాత్రమే పింఛన్ పెంచి గొప్పలు చెప్పుకుంటున్నాడన్నారు. ఇప్పుడు పలువురు అర్హులకు కూడా పింఛన్ కోత పెట్టేందుకు శ్రీకారం చుడుతున్నాడని విమర్శించారు.

➡ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి చీదెళ్ల కిషన్ మాట్లాడుతూ ప్రశ్నించే యువతపై రాష్ట్ర వ్యాప్తంగా చంద్రబాబు ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోందన్నారు. అయినా తమ పోరాటం ద్వారా 'తల్లికి వందనం' పథకం అమలు చేయించగలిగామన్నారు. సంవత్సరానికి ఒక్కొక్క నిరుద్యోగికి నిరుద్యోగభృతి కింద రూ.36 వేలు బాకీ ఉందన్నారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వం మెడలు వంచి యువతకు నిరుద్యోగ భృతి ఇచ్చేలా వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని లోకేశ్ చెప్పారని, ఇప్పుడు ఆ ఊసే లేదన్నారు.

➡ రాష్ట్ర యువజవన విభాగం ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు అంటేనే మోసం, జగన్‌అంటేనే నమ్మకం అన్నారు. కరోనా సమయంలో కూడా సంక్షేమ పథకాలు అందించిన గొప్ప వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం హామీలు గురించి ప్రశ్నించే వారి గొంతుకలను కూటమి ప్రభుత్వం నొక్కుతుందన్నారు. అయినా భయపడేది లేదన్నారు. మోసపోయిన విద్యార్థులు, యువత అధికార పార్టీకి తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

➡ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు అశ్రిత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వకపోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి బలవంతంగా ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులు సర్టిఫికెట్‌లు తీసుకోలేక అల్లాడుతున్నారన్నారు.

➡ కావలి నియోజకవర్గ యువజన విభాగం నేత చైతన్య మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టగానే 1.25 లక్షల ఉద్యోగాలు కల్పించారన్నారు. 2.50 లక్షల మందికి ఉపాధి చూపారన్నారు. చంద్రబాబు రాగానే ఉన్న ఉద్యోగాలను తొలగిస్తున్నాడని విమర్శించారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ అని చంద్రబాబు నిరూపించారన్నారు.

➡ వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు బొబ్బల శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల్లో 140కి పైగా హామీలిచ్చి ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ఏడాది 5 లక్షలు కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికే 4 లక్షల మందికి ఉన్న ఉద్యోగాలు తొలగించిందని విమర్శించారు.

➡ కోవూరు వైఎస్సార్‌సీపీ నేత వీరి చలపతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలో రూ.1.40 లక్షల కోట్ల అప్పులు చేసిందన్నారు. ఆ డబ్బుతో ఒక్క చోట కూడా అభివృద్ధి పనులు చేయలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు రూ.2 వేల కోట్ల బకాయిలున్నాయన్నారు. యువజన, విద్యార్థి నాయకులు అన్వేష్, మల్లి, యోగి మాట్లాడారు. యువత పోరు ఉద్యమానికి తరలివచ్చిన యువతీ, యువకులకు వైఎస్సార్‌సీపీ మహిళా జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, జిల్లా అధ్యక్షురాలు కాకుటూరు లక్ష్మీసునంద, మైనార్టీ రాష్ట్ర నాయకులు ఖలీల్ తదితరులు సంఘీభావం తెలిపారు.



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న పర్వతరెడ్డి



ప్లకార్డులతో ర్యాలీగా వస్తున్న యువకులు



వైఎస్సార్‌సీపీ మహిళా నేతల సంఘీభావం



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న యువత



నిరుద్యోగ యువత భారీ ర్యాలీ



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు నాగార్జున



యువత పోరు ఉద్యమానికి బైక్ ర్యాలీగా వస్తున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నేతలు, శ్రేణులు

న్యూస్‌రీల్

గిరిజన బాలికకు నల్లపరెడ్డి పరామర్శ

- రూ.20 వేల ఆర్థిక సాయం అందజేత



చికిత్స పొందుతున్న గిరిజన బాలిక ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొంటున్న ప్రసన్న

కోవూరు: ఇందుకూరుపేట మండలం కుడితిపాళెంలో చిత్రహింసలకు గురై శరీరం అంతా కాలిన గాయాలతో నెల్లూరు అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గిరిజన బాలిక గంధళ్ల చెంచమ్మను మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరడంతోపాటు, బాధిత కుటుంబానికి రూ.20,000 ఆర్థిక సహాయం అందించి వారికి ధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ చెంచమ్మపై జరిగిన దారుణం హృదయాన్ని కలిచి వేసింది. ప్రభుత్వం బాధితురాలికి అండగా నిలిచి రక్షణ కల్పించడంతోపాటు ఆమెకు న్యాయం జరగాలి. మెరుగైన వైద్యం అందించాలన్నారు. ప్రసన్న వెంట జొన్నవాడ దేవస్థానం చైర్మన్, ఇందుకూరుపేట మండల పార్టీ అధ్యక్షుడు మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ తదితరులున్నారు.

కేంద్ర ప్రభుత్వ శాఖల్లో గ్రూప్-బీ, సీ పోస్టులకు నోటిఫికేషన్

- 5వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలి

నెల్లూరు (టౌన్): కేంద్ర మంత్రిత్వశాఖ వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఉన్న భారత ప్రభుత్వ సంస్థల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో గ్రూప్-బీ, గ్రూపు-సీ పోస్టులకు సంబంధించి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు డీఈఓ బాలాజీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామినేషన్ (సీబీటీ), కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ ఎగ్జామినేషన్ 2025 సంబంధించి వచ్చేనెల 4వ తేదీలోపు దరఖాస్తు అందజేయాలని, 5వ తేదీలోపు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలన్నారు. పరీక్ష ఆగస్టు 13వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరగనున్నట్లు చెప్పారు. పరీక్షకు సంబంధించిన పోస్టుల వివరాలు, వయోపరిమితి, ఫీజు వివరాలు, దరఖాస్తు చేసే విధానం, ఇతర వివరాలు ssc. gov. in వెబ్‌సైట్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు.

విజయ డెయిరీ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంపు



విజయ డెయిరీ చైర్మన్, పాలక మండలి సభ్యులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు విజయ డెయిరీలో పనిచేస్తున్న సిబ్బంది, ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 58 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు పెంచుతూ డెయిరీ పాలకమండలి సోమవారం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. వెంకటేశ్వరపురంలోని విజయ డెయిరీ కార్యాలయంలో చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి అధ్యక్షతన పాలక మండలి సమావేశం జరిగింది. ఎంతో కాలంగా ఈ ప్రతిపాదన పాలక మండలి వద్ద పెండింగ్‌లో ఉంది. ఈ నిర్ణయం తీసుకునే విషయంలో డెయిరీ ఆదాయ, ఖర్చులతోపాటు ఉద్యోగుల నియామకం, జీతభత్యాలు తదితర అంశాలపై కసరత్తు చేస్తోంది. తాజాగా జరిగిన సమావేశంలో ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 ఏళ్ల వరకు పెంచుతూ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తీసుకున్న నిర్ణయానికి పాలకమండలి సభ్యులు అందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. దీంతో ఉద్యోగులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

కాకాణితో ఎమ్మెల్సీలు ములాఖత్



కాకాణిని కలిసేందుకు జిల్లా సెంట్రల్ జైలు వద్దకు వచ్చిన ఎమ్మెల్సీలు శివరామిరెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

వెంకటాచలం: కూటమి ప్రభుత్వం మోపిన అక్రమ కేసులతో జిల్లా సెంట్రల్ జైల్లో ఉన్న మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ఎమ్మెల్సీలు శివరామిరెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ములాఖత్ అయ్యారు. కూటమి ప్రభుత్వ కుట్రలతోపాటు, జిల్లాలో తాజా రాజకీయ పరిస్థితులు, ఇతర అంశాలపై చర్చించారు.

కౌన్సెలింగ్‌లో 'ప్రైవేట్' ప్రలోభాలు

నెల్లూరు (టౌన్): పాలిసెట్ కౌన్సెలింగ్‌లో ప్రైవేట్ ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల ప్రతినిధులు ప్రలోభాలు మితిమీరాయి. వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 21వ తేదీ నుంచి కౌన్సెలింగ్ జరుగుతోంది. ఈ కౌన్సెలింగ్ కేంద్రం ముందు ఆది, సోమవారాల్లో శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల, గీతాంజలి కళాశాల బస్సులు తీసుకువచ్చి ప్రచారం చేస్తున్నారు. ఈ బస్సులకు ఇరు వైపులా బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వారి ప్రతినిధులు నేరుగా కౌన్సెలింగ్ కేంద్రాల్లోకి వచ్చి తమ కళాశాలల్లో చేరితే మీకు గిఫ్ట్‌లతోపాటు ప్రయోజనాలు ఉంటాయని విద్యార్థులను ప్రలోభ పెడుతున్నారు. ఈ విషయం పాలిసెట్ కౌన్సెలింగ్ కన్వీనర్, అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. ప్రైవేట్ కళాశాలల ప్రతినిధులు, కౌన్సెలింగ్ అధికారుల మధ్య లోపాయికారి ఒప్పందాల కారణంగానే ఈ విధంగా బాహాటంగా ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణంగా కౌన్సెలింగ్ కేంద్రం పరిసరాల్లోకి ప్రైవేట్ కళాశాలల వాహనాలకు అనుమతి లేదు. అయినా ఆయా కళాశాలల ప్రతినిధులు నేరుగా కౌన్సెలింగ్ కేంద్రంలోకి వచ్చి ప్రచారం చేయడం చూస్తే ఎంతగా బరితెగించారో అర్థమవుతోంది. ఇప్పటికే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య ప్రతి ఏటా తగ్గుతుండగా ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో మాత్రం సంఖ్య పెరుగుతుండడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని కేంద్రంలో ప్రైవేట్ కళాశాలల ప్రతినిధులు ప్రచారాన్ని కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. ఇదే తంతు కొనసాగితే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.



పాలిసెట్ కౌన్సెలింగ్ కేంద్రం ముందు ప్రైవేట్ కళాశాలల బస్సులు

ట్రిపుల్ ఐటీలకు 264 మంది విద్యార్థులు

నెల్లూరు (టౌన్): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వచ్చిన మార్కులు ఆధారంగా జిల్లా నుంచి 264 మంది విద్యార్థులు రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ (ట్రిపుల్ ఐటీ)ల్లో సీట్లు సాధించారు. ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించిన వారిలో ప్రభుత్వ పాఠశాలలతోపాటు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కూడా ఉన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీకి 72 మంది, ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీకి 96 మంది, ఒంగోలు ట్రిపుల్ ఐటీకి 76 మంది, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి 20 మంది విద్యార్థులు ఎంపికైనట్లు సమాచారం. ట్రిపుల్ ఐటీలో ఎక్కువ మంది బాలికలే సీట్లు సాధించారు. నెల్లూరు నగరంలోని బీవీఎస్‌ఎం బాలికల హైస్కూల్ విద్యార్థిని దొనెపర్తి సుచరిత రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంకు, నగరంలోని నవలాకులతోటలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని మహమ్మద్ జువేరియా 19వ ర్యాంకు సాధించడంతో నూజివీడులో సీట్లు పొందారు. ట్రిపుల్ ఐటీల్లో సీట్లు పొందిన విద్యార్థులకు ఈ నెల 30 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. వచ్చేనెల 14వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.

బీసీ హాస్టల్ మూసివేత

దుత్తలూరు: పేద విద్యార్థులను చదువుకు దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గత విద్యా సంవత్సరం ప్రారంభంలోనే జిల్లాలో చాలా వసతి గృహాలను మూసివేసిన ప్రభుత్వం తాజాగా మరికొన్ని మూసివేతకు సిద్ధమైంది. పేద విద్యార్థులు వసతి పొందుతూ చదువుకునేందుకు దశాబ్దాల క్రితం గత ప్రభుత్వాలు వసతి గృహాలను ఏర్పాటు చేశాయి. అయితే కూటమి ప్రభుత్వం ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే దుత్తలూరులోని బీసీ బాలుర వసతిగృహాన్ని మూసివేసింది. ఈ వసతి గృహంలో మూడో తరగతి నుంచి 10వ తరగతి వరకు 44 మంది విద్యార్థులు వసతి పొందుతూ చదువుకుంటున్నారు. గతంలో ఇదే వసతి గృహంలో దాదాపు 150 మంది వరకు విద్యార్థులు ఉండేవారు. వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం, ఇతర సౌకర్యాలు కల్పించకపోవడంతో చాలా మంది విద్యార్థులు చదువులకు స్వస్తి చెప్పి ఇళ్లకు వెళ్లిపోయి కూలి పనులు చేసుకుంటూ బతుకుతున్నారు. తాజాగా విద్యా సంవత్సరం ప్రారంభమై పాఠశాలల తెరిచిన సమయంలో ముందస్తు సమాచారం ఇవ్వకుండానే దుత్తలూరులోని వసతి గృహాన్ని మూసివేశారు. హాస్టల్‌కు వచ్చిన పిల్లలు ఎక్కడికి వెళ్లాలి.. ఎక్కడ ఉండి చదువుకోవాలనే సందిగ్ధంలో తిరిగి ఇళ్లకు వెళ్లిపోయారు. ఇక్కడ వసతి గృహంపై కనీసం సమాచారం ఇచ్చేవారు కూడా లేకుండాపోయారు. హాస్టళ్లను ఎత్తివేసే దిశగానే ప్రభుత్వం ఈ చర్యలకు పూనుకుంటోందని పలువురు విమర్శిస్తున్నారు. దశాబ్దాలుగా నియోజకవర్గంలోనే ఎంతో పేరుగాంచిన ఈ బాలుర వసతిగృహాన్ని ఈ ఏడాది నుంచి ఎత్తివేయడంపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ విషయమై కావలి అసిస్టెంట్ బీసీ సంక్షేమాధికారి వెంకటేశ్వర్లును వివరణ కోరగా హాస్టల్ భవనం పూర్తిగా శిథిలమైందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హాస్టల్‌ను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.



మూతపడిన బీసీ బాలుర వసతి గృహం

ధర్నాలు చేసి.. సమస్యల్ని నినదించి..

నెల్లూరు రూరల్: కూటమి ప్రభుత్వంపై వివిధ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సమస్యల పరిష్కారం కోసం పోరు బాట పట్టాయి. సోమవారం నెల్లూరులోని కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ యూనియన్, విద్యార్థి సంఘం, కార్పొరేషన్ ఎదుట ఎంప్లాయీస్ యూనియన్ నేతలు ధర్నాలు చేశారు.

'తల్లికి వందనం' అమలు చేయాలంటూ..

సమగ్ర శిశు అభివృద్ధి సేవ పథకం కింద గ్రామీణ స్థాయిలో పనిచేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ అంగన్‌వాడీ వర్కర్లకు తల్లికి వందనం పథకం అమలు చేయాలంటూ కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ అనుబంధ యూనియన్ వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు, రేషన్ కార్డులు ఇవ్వాలని, సాధికార సర్వేలో ప్రభుత్వ ఉద్యోగం అనే పదం తొలగించాలని డిమాండ్ చేశారు. గౌరవ వేతనంతో ఉపాధి పొందుతున్నారని, సంక్షేమ పథకాలు లేకపోతే బతకడం కష్టమన్నారు. ఐదు సంవత్సరాల్లోపు పిల్లలందరూ అంగన్‌వాడీ సెంటర్‌లోనే ఉండేలా జీఓ ఇవ్వాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు చేయాలని కోరారు. మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలన్నారు. ప్రతినెలా 10వ తేదీ నాటికి లబ్ధిదారులకు ఇచ్చే అన్ని రకాల సరుకులు సకాలంలో సెంటర్‌కు చేర్చాలని కోరారు. మెనూ చార్జీలు పెంచాలని కోరారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు వెంకటేశ్వరపురం పాలిటెక్నిక్ కళాశాల హాస్టళ్లలో సమస్యలున్నాయని, అధికారులు చొరవ తీసుకుని పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా జరిగింది. అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సునీల్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి విద్యార్థులు ప్రభుత్వ పాలిటెక్నిక్ హాస్టళ్లలో ఉంటున్నారని, మౌలిక వసతుల్లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. బురద నీరు వస్తోందని, పిల్లలు స్నానం కూడా చేయలేకపోతున్నట్లు చెప్పారు. ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని వెంటనే భర్తీ చేయాలన్నారు. కరెంట్ బిల్లు ప్రభుత్వమే కట్టేలా చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నేతలు అక్రమ్, తాహిర్ తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ జిల్లా కమిటీ నాయకులు

సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

నెల్లూరు(బారకాసు): మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నెల్లూరు నగరపాలక సంస్థ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం బారాషహీద్ దర్గా గ్రౌండ్స్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయం ప్రధాన గేటు వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నెల్లూరు నగర గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి కె.పెంచల నరసయ్య, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్‌బీ మాట్లాడారు. దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల పట్ల కూటమి ప్రభుత్వం వివక్షపూరిత ధోరణితో వ్యవహరించడం సరికాదన్నారు. బ్యాంక్ రుణాలు కోరితే మీరు ఉద్యోగులు కాదని, రోజువారి కూలీలని చెప్పిన పాలకులు, కార్మికులకు వర్తింపజేసే సంక్షేమ పథకాలు తీసివేయడానికి ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఉద్యోగులుగా చూపించడం విడ్డూరంగా ఉందన్నారు. 60 సంవత్సరాలు నిండాయనే నెపంతో ఏ రకమైన రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా, నోటీసులు కూడా ఇవ్వకుండా 93 మంది కార్మికులను అన్యాయంగా తొలగించారన్నారు. మంచినీటి సరఫరా వీధిలైట్లు తదితర పనులు నిర్వహించే ఇంజినీరింగ్ విభాగంలోని కార్మికులకు అతి తక్కువ వేతనాలు ఇస్తున్నారని తక్షణమే వారి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ధర్నా వద్దకు విచ్చేసిన కమిషనర్ వైఓ నందన్‌కు నాయకులు, కార్మికులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కొండా ప్రసాద్, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కామాక్షమ్మ, మట్టిపాటి శ్రీనివాసులు, సుజాతమ్మ, లోకేష్ భాగ్యమ్మ, మనోజ్, జైకుమార్, షబ్బీర్, రాంబాబు, పందల శ్రీనివాసులు, దార్ల మాలకొండయ్య, బాలు, కొండమ్మ, వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.


ఎన్ఎంసీ కార్యాలయం ప్రధాన గేటు వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు


ఈ చిత్రంలోని బాలిక పేరు పాకం పూజ. తల్లిదండ్రులు మరణించారు. బుచ్చిరెడ్డి పాళెం మదర్‌థెరిస్సా నిలయం అనే అనాథాశ్రమంలో ఉంటోంది. బుచ్చి బాలికల హైస్కూల్లో 10వ తరగతి చదివింది. బుచ్చిరెడ్డిపాళెం గురుకుల కళాశాలలో అడ్మిషన్ వచ్చిందని ఫోన్ చేసి చెప్పారు. అయితే తల్లిదండ్రుల డెత్ సర్టిఫికెట్ తెస్తేనే జాయిన్ చేసుకుంటామని అక్కడి వారు అన్నారు. సర్టిఫికెట్ లేదని, ఆశ్రమ నిర్వాహకులను గార్డియన్‌గా పెట్టి అడ్మిషన్ ఇవ్వాలని అధికారులను వేడుకుంది.

వెల్లువలా వినతులు


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న అధికారులు

నెల్లూరు రూరల్: నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, సర్వే రికార్డుల ఏడీ నాగేశ్వర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వివిధ సమస్యలపై జాప్యం లేకుండా వెంటనే సమస్యల్ని పరిష్కరించాలన్నారు. మొత్తం 399 అర్జీలను ప్రజలు అందజేశారు. వీటిలో ఎక్కువగా రెవెన్యూ శాఖకు సంబంధించి 142, మున్సిపల్ శాఖవి 39, సర్వేవి 44, పంచాయతీరాజ్ శాఖవి 32, పోలీసు శాఖవి 39 తదితరాలున్నాయి.

పేదల భూముల ఆక్రమణ

నెల్లూరులోని వేదాయపాళెం చంద్రమౌళి నగర్‌లో సర్వే నంబర్ 78/2లో గతంలో పేదలకిచ్చిన ప్రభుత్వ భూమిని రిటైర్డ్ ఉద్యోగి పోగుల విజయసేన్ కుమార్ నకిలీ డాక్యుమెంట్లతో ఆక్రమించి బిల్డింగ్ నిర్మించి అమ్మేందుకు ప్రయత్నిస్తున్నాడని, చర్యలు తీసుకోవాలని చేకూరి సురేష్ అనే వ్యక్తి వినతిపత్రమిచ్చాడు. ఈ విషయమై అనేకసార్లు నెల్లూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు.

నష్టాలు ఎదుర్కొంటున్నాం

40 ఏళ్లుగా కేబుల్ టీవీ వ్యాపారాన్ని జీవనోపాధిగా చేసుకున్నాం. ప్రస్తుతం వచ్చిన విప్లవాత్మక మార్పులతో ఎల్‌సీఓలు ఉనికి కోల్పోయి ఆర్థికంగా అనేక నష్టాలను ఎదుర్కొంటున్నాం. డిజిటలైజేషన్ తర్వాత కేబుల్ టీవీని ట్రాయ్ రెగ్యులేటరీ చట్టం కిందకు తీసుకువచ్చారు. దీంతో ప్రజలు అధిక చార్జీలను చెల్లించాల్సి వస్తోంది. చార్జీలు పెంచకుండా నిలుపుదల చేయాలి. అదే సమయంలో ఎల్‌సీఓలను కూడా ట్రాయ్ పరిధిలోకి తీసుకొచ్చి బ్రాడ్‌కాస్టర్లు, ఎంఎస్‌ఓలతోపాటు కేబుల్ ఆపరేటర్స్ అసోసియేషన్ వారిని కూడా భాగస్వాములను చేయాలి.

– కేబుల్ టీవీ ఆపరేటర్లు


మాట్లాడుతున్న ఆపరేటర్లు

కండలేరులో 34.975 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 34.975 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 2,450, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

వేధిస్తున్నారు.. రక్షణ కల్పించండి


బాధితుల సమస్యలు వింటున్న ఏఎస్పీ సౌజన్య

నెల్లూరు(క్రైమ్): పెళ్లికి అంగీకరించలేదన్న అక్కసుతో సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడుతూ ఒకరు, కోర్కె తీర్చమని ఇంకొకరు, అసభ్యంగా ప్రవర్తిసూ మరొకరు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, రక్షణ కల్పించాలని బాధిత మహిళలు, యువతులు కోరారు. సోమవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఏఎస్పీ సీహెచ్ సౌజన్య బాధితులతో మాట్లాడి ఆయా ప్రాంత పోలీస్ అధికారులకు ఆదేశాలిచ్చారు. వేధింపులకు గురిచేస్తున్న వారిపై తక్షణమే కేసులు నమోదు చేయాలన్నారు. వివిధ సమస్యలపై 96 ఫిర్యాదులందాయి. కార్యక్రమంలో నగర, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీలు పి.సింధుప్రియ, చెంచురామారావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసరెడ్డి, ఎస్‌బీ–2 ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- పెళ్లి చేసుకోవాలంటూ శశి అనే వ్యక్తి వేధిస్తున్నాడు. నేను నిరాకరించడంతో సోషల్ మీడియాలో నాపై అసభ్యకరమైన మెసేజ్‌లను బంధువులకు పంపిస్తున్నాడు. ఊర్లో, కళాశాల వద్ద అసత్య ప్రచారాలు చేస్తున్నాడు. అతడి బారి నుంచి రక్షణ కల్పించాలని ఉలవపాడుకు చెందిన ఓ యువతి కోరారు.
- నా కుమార్తెతో చింటూ, సుధీర్, జయకృష్ణ అనే వ్యక్తులు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. ఈనెల 20వ తేదీన ఆమె ఫొటోలు తీసి ఇబ్బంది పెడుతున్నారని దుత్తలూరు ప్రాంతానికి చెందిన ఓ మహిళ వినతిపత్రమిచ్చారు.
- కోర్కె తీర్చాలని, లేదంటే నా ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడతానని శివ అనే వ్యక్తి బెదిరిస్తున్నాడు. అతడిపై చర్యలు తీసుకోవాలని నెల్లూరు రూరల్ మండలానికి చెందిన ఓ మహిళ విజ్ఞప్తి చేశారు.
- నా భార్య అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంత వరకూ ఆమె జాడ తెలియరాలేదు. ఆచూకీ కనుక్కోవాలని బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన ఓ వ్యక్తి కోరాడు.

పోక్సో కేసు నమోదు

నెల్లూరు సిటీ: ఎనిమిది ఏళ్ల బాలికపై లైంగికదాడికి యత్నించిన నెల్లూరు రూరల్ మండలంలోని కనుపర్తిపాడుకు చెందిన సత్యం (50)పై రూరల్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ వేణు సోమవారం తెలిపారు.

కాగా నిందితుడిపై రౌడీషీట్ తెరవాలని పోలీసులను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కోరారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.30
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.8



వ్యాన్ ఢీకొని యువకుడి దుర్మరణం

- జగనన్న కాలనీలో మోటార్ల చోరీకి వెళ్లిన దొంగల ముఠా
- స్థానికులు రావడంతో వ్యాన్‌లో పరారయ్యే క్రమంలో బైక్‌ను ఢీకొన్న దొంగలు
- దుండగులు టీడీపీ వర్గీయులు కావడంతో కాపాడే యత్నం

కోవూరు: మండలంలోని జమ్మిపాళెంలో ఉన్న జగనన్న కాలనీలో సబ్‌మెర్సిబుల్ మోటార్ల చోరీకి వ్యాన్‌లో వెళ్లిన దొంగల ముఠా స్థానికులు రావడంతో వ్యాన్‌తోసహా పరారయ్యే క్రమంలో ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొనడంతో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి జమ్మిపాళెం సమీపంలో ఇటుకుల బట్టీ వద్ద జరిగింది. అయితే ఈ దొంగల ముఠా టీడీపీ వర్గీయులు కావడంతో వారిని కాపాడేందుకు నేతలు ప్రయత్నిస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యులు, స్థానికుల సమాచారం మేరకు.. జమ్మిపాళేనికి చెందిన మర్లపాటి సుధీర్‌బాబు (32)కు భార్య ముత్యాలమ్మ, ముగ్గురు పిల్లలున్నారు. అతను నెల్లూరులోని ఓ షాపింగ్ మాల్‌లో క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో జమ్మిపాళెం మార్గంలో ఇటుకల బట్టీల వద్దకు వచ్చేసరికి అతడి బైక్‌ను పడుగుపాడు వైపు వస్తున్న టాటా ఏస్ వాహనం బలంగా ఢీకొంది. దీంతో సుధీర్‌బాబు తీవ్రగాయాలతో ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని కోవూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


సుధీర్‌బాబు మృతదేహం

రూ.2 లక్షలిస్తామని బేరాలు

ఈ ప్రమాదానికి కారణమైన వ్యాన్ డ్రైవర్ ప్రసాద్‌తో పాటు మణి, శ్రీహరి, మరో వ్యక్తి పడుగుపాడుకు చెందిన టీడీపీ వర్గీయులు. వీరు ఇందుకూరుపేటకు చెందిన కోడూరు కమలాకర్‌రెడ్డికి ముఖ్య అనుచరులు. ప్రమాదం జరిగిన తర్వాత నిందితులు ఆగకుండా వ్యాన్‌తో సహా పరారయ్యారు. ఈ విషయం తెలిసిన వెంటనే స్థానిక టీడీపీ ముఖ్య నేతలు కొందరు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని పోలీసులపై ఒత్తిడి తేవడంతోపాటు ప్రైవేట్ పంచాయితీ పెట్టారు. బాధిత కుటుంబానికి రూ.2 లక్షలు పరిహారంగా ఇస్తామని, కేసు లేకుండా చేయాలని ఒత్తిడి చేశారు. అయితే బాధిత కుటుంబం తరఫున మరో టీడీపీ నేత వచ్చి రూ.30 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో ఈ పంచాయితీ సోమవారం రాత్రి వరకు తెగ లేదు. నిందితులు నలుగురూ స్థానిక టీడీపీ నేత ఇంట్లోనే ఉన్నట్లు సమాచారం.

టీడీపీ నేతల దన్ను

నిందితులు టీడీపీ వర్గీయులు కావడంతో వారిని కాపాడేందుకు ఆ పార్టీ ముఖ్య నేతలు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే స్థాయిలో పోలీసులపై ఒత్తిడి చేయిస్తున్నారని సమాచారం. రోడ్డు ప్రమాదానికి కారణమైన నిందితులు జమ్మిపాళెం సమీపంలో ఉన్న జగనన్న కాలనీవాసుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన బోర్లలోని సబ్‌మెర్సిబుల్ మోటార్లను చోరీ చేసేందుకు టాటా ఏస్ వ్యాన్‌లో వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. స్థానికులు గమనించి అక్కడికి రావడంతో దుండగులు వ్యాన్‌తోపాటు పరారయ్యే క్రమంలో స్థానికులు వారిని వెంబడించడంతో అతి వేగంగా వెళ్తూ ఎదురుగా బైక్‌పై వస్తున్న సుధీర్‌బాబును ఢీకొన్నట్లు స్థానికులు చెబుతున్నారు. నిండు ప్రాణాన్ని బలిగొన్న దొంగల ముఠా టీడీపీ వర్గీయులు అని తెలియడంతో ఆ పార్టీ నేతలు వారిని కాపాడే ప్రయత్నం చేయడాన్ని స్థానికులు అసహ్యించుకుంటున్నారు.

జమ్మిపాళెంలో విషాదం

అందరితో కలివిడిగా ఉండే సుధీర్‌బాబు చనిపోవడంతో స్థానికులు కంటతడి పెడుతున్నారు. అతని భార్య, ముగ్గురు బిడ్డలు అనాథలు అయ్యారంటూ విచారం వ్యక్తం చేస్తున్నారు. సుధీర్‌బాబు తల్లి చెంచమ్మ అంగన్‌వాడీ వర్కర్‌గా పనిచేస్తోంది. ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఇసుక రీచ్‌లో దాడులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడ ఇసుక రీచ్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో ఆర్‌ఐ శాంతిప్రియ సోమవారం దాడులు నిర్వహించారు. రెండు ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించారు. ఆర్‌ఐని చూడగానే డ్రైవర్లు పరారయ్యారు. ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీసులకు అప్పగిస్తామని ఆమె తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కన్నతండ్రి పైశాచికత్వం

- మద్యం మత్తులో కుమారుడి చేతిపై వాతలు
- రాజీవ్ గృహకల్పలో ఘటన

నెల్లూరు(క్రైమ్): మద్యం మత్తులో గరిటతో కుమారుడి చేయి, మెడపై కాల్చిన తండ్రిపై నెల్లూరు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. రాజీవ్ గృహకల్పకు చెందిన మునీంద్ర, సురేఖ దంపతులకు నలుగురు సంతానం. మునీంద్ర పెయింట్ పనులు, సురేఖ పాచిపనులు చేస్తుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 18వ తేదీన సురేఖ పనికి వెళ్లగా మునీంద్ర ఇంట్లో ఉన్నాడు. మద్యం మత్తులో గరిటను కాల్చి పెద్దకుమారుడు కేశవ కుడిచేయి, కుడి వైపు మెడపై వాతలు పెట్టాడు. పని నుంచి ఇంటికి వచ్చిన తల్లికి కుమారుడు తండ్రి చేసిన నిర్వాకాన్ని తెలియజేశాడు. ఆమె కుమారుడికి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించింది. సోమవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): కుటుంబ సమస్యల నేపథ్యంలో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు వేణుగోపాల్‌నగర్‌కు చెందిన ఎ.మహేష్ (39), నాగలక్ష్మి దంపతులకు కుమార్తె, కుమారుడు సంతానం. మహేష్ మాగుంట లేఅవుట్‌లోని పీఎస్‌ఆర్ బాత్ హౌస్‌లో పనిచేస్తున్నాడు. విభేదాల నేపథ్యంలో ఏడాదిన్నర క్రితం దంపతులు విడిపోయారు. అప్పటి నుంచి మహేష్‌కు తోడుగా తల్లి సుజాత ఉంటున్నారు. సుజాత నెలరోజుల క్రితం హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికెళ్లారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి మహేష్ తన ఇంట్లోని ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని గమనించిన ఇంటి యజమాని నాగూరయ్య మృతుడి బంధువులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. వారు సోమవారం నెల్లూరుకు చేరుకున్నారు. బంధువు మనోజ్‌కుమార్ ఆత్మహత్య ఘటనపై నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు మృతదేహాన్ని పరిశీలించి జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుకాణాల్లోకి దూసుకెళ్లిన టిప్పర్

వెంకటాచలం: మండల కేంద్రమైన వెంకటాచలంలోని సర్వేపల్లి క్రాస్‌రోడ్డు వద్ద రెండు దుకాణాల్లోకి టిప్పర్ దూసుకెళ్లిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం మేరకు.. సర్వేపల్లి క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ రహదారి దాటుతున్న లారీని నెల్లూరు వైపు నుంచి గూడూరు వైపు వెళ్తున్న టిప్పర్ ఢీకొట్టి, జాతీయ రహదారి పక్కనే ఉన్న రెండు దుకాణాల్లోకి తీసుకెళ్లింది. ఆ సమయంలో దుకాణాల్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఘటనా స్థలంలో టిప్పర్